క్లుప్తంగా

గండిపాళెం ప్రాజెక్ట్ చైర్మన్‌గా అడుసుమల్లి

ఉదయగిరి: గండిపాళెంలోని పీ చెంచురామయ్య జలాశయం చైర్మన్‌గా అడుసుమల్లి వెంకటసుబ్బయ్య, వైస్‌చైర్మన్‌గా కుమ్మిత రమణారెడ్డి ఎన్నికయ్యారు. శనివారం ప్రాజెక్టు వద్ద జరిగిన సమావేశంలో పాజెక్ట్ పరిధిలోని 17 డిస్ట్రిబ్యూటరీలకు చెందిన సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆత్మకూరు ఆర్డీఓ పావని ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. మాజీ జెడ్పీటీసీ పీ చెంచలబాబు, టీడీపీ నేతలు బయ్యన్న, చంద్రా మధు, బీ శ్రీనివాసులు, ఇరిగేషన్ అధికారులు పాల్గొన్నారు.

వీల్‌చైర్ వితరణ



కావలి: ముసునూరులోని ఇందిరమ్మ కాలనీకి చెందిన దివ్యాంగుడు చిట్టేటి సురేష్‌కు కావలికి చెందిన రత్నమ్మ చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు ఎంవీఎస్ ప్రసాద్‌రావు శనివారం వీల్‌చైర్‌ను వితరణ చేశారు. తన తల్లి సుబ్బరత్నమ్మ జ్ఞాపకార్థంగా రూ.12వేల విలువైన వీల్‌చైర్‌ను అందజేసినట్లు ఆయన తెలిపారు. విశ్రాంత వార్డెన్ షేక్ ఖాదర్‌బాషా, సంయుక్త సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు సురేంద్ర, పిడుగు వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

క్విజ్ పోటీలు

ఆత్మకూరురూరల్: జాతీయ గణిత దినోత్సవాన్ని పురస్కరించుకుని కరటంపాడు జెడ్పీ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు గణితంలో క్విజ్ పోటీలను శనివారం నిర్వహించారు. ఎంఈఓ-2 చలపతి ముఖ్యఅతిథిగా హాజరై విద్యార్థులకు గణిత దినోత్సవం విశిష్టతను వివరించారు. ఉపాధ్యాయులు పెంచలరెడ్డి, ప్రతాప్ చక్రవర్తి గణితంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. హెచ్ఎం మాలకొండలరావు పాల్గొన్నారు.

దివ్యాంగులకు బోధనపై ఆరా

కావలి: పట్టణంలోని దివ్యాంగ చిన్నారులకు ఇంటి వద్ద సహిత ఉపాధ్యాయిని మమత చేస్తున్న బోధనను ఎంఈఓ-1 బీ గోవిందయ్య శనివారం పరిశీలించారు. జనతాపేటసౌత్‌లోని టీ వెంకట కార్తీక్, బాలకృష్ణారెడ్డి నగర్‌కు చెందిన ఎం మోహన్‌దత్తాత్రేయ ఇళ్లకు వెళ్లి బోధన తీరుపై తల్లులను ఆరాతీయగా వారు సంతృప్తి వ్యక్తం చేశారు. సహిత ఉపాధ్యాయినులు మమత, ఎం లక్ష్మి ఉన్నారు.

నిత్యావసరాల పంపిణీ

అనుమసముద్రంపేట: క్రిస్మస్‌ను పురస్కరించుకుని కావలియడవల్లి ఎస్సీ కాలనీలోని 75 కుటుంబాలకు గ్రామానికి చెందిన ఏలూరు మాల్యాద్రినాయుడు నిత్యావసర సరుకులను శనివారం పంపిణీ చేశారు. క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. సర్పంచ్ ముప్పూరి ధనమ్మ, వార్డు సభ్యులు మన్నం మోహన్‌రావు, మాజీ సర్పంచ్ విమలమ్మ పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులకు అర్జీల వెల్లువ

ఆత్మకూరురూరల్: మండలంలోని మహిమలూరు, రామస్వామిపల్లి గ్రామాల్లో శనివారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులకు వినతులు వెల్లువెత్తాయి. భూసమస్యలపై రైతుల నుంచి 50 వినతులు అందాయని తహసీల్దార్ సుధీర్ తెలిపారు. అర్జీలను క్షేత్ర స్థాయిలో విచారించి పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామన్నారు. డీటీ స్వరూప్, వీఆర్వోలు మీరావలి, నాగూర్‌బీ, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

మంచిమాట నేడు

ఆత్మకూరు: పట్టణానికి చెందిన తెలుగు భారతి సేవా సమితి ఆధ్వర్యంలో మంచి మాట కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించనున్నట్లు ఆ సమితి నిర్వాహకులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని చావడి సెంటర్‌లోని గ్రంథాలయంలో సాయంత్రం 5 గంటలకు జరిగే కార్యక్రమంలో ఉమ్మడి కుటుంబం- లాభాలు అన్న అంశంపై చర్చించనున్నట్లు వివరించారు.

వీరరఘుకు సత్కారం

బిట్రగుంట: వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మద్దిబోయిన వీరరఘును పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు శనివారం ఘనంగా సత్కరించారు. వైఎస్సార్‌సీపీ ఆర్‌టీఐ విభాగం జిల్లా అధ్యక్షుడిగా నియమితులైన సందర్భంగా బోగోలులోని పార్టీ కార్యాలయంలో శాలువాలు, పూలమాలలతో సత్కరించి అభినందనలు తెలియజేశారు.

డ్రైవర్లకు కంటి పరీక్షలు



కావలి: మండలంలోని గౌరవరం టోల్‌ప్లాజా వద్ద సింహపురి ఎక్స్‌ప్రెస్‌వే ఎన్‌హెచ్-16 ప్రాజెక్ట్ హెడ్ శివకుమార్ ఆధ్వర్యంలో శనివారం ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించారు. 94 మంది లారీ డ్రైవర్లకు కంటి పరీక్షలు చేశారు. కావలిరూరల్ సీఐ జీ రాజేశ్వరరావు, ఎస్సై తిరుమలరెడ్డి చేతుల మీదుగా కంటి అద్దాలు ఉచితంగా పంపిణీ చేశారు. టోల్‌ప్లాజా మేనేజర్ గణేష్, రూట్ ఆపరేషన్ హెడ్ నరసింహారావు, మేనేజర్ కేశవ్, ఎల్వీ కంటి ఆస్పత్రి సిబ్బంది, టోల్‌ప్లాజా సిబ్బంది పాల్గొన్నారు.

ముంపు సమస్యను గట్టెక్కేదెలా?

- పొలాలను ముంచెత్తుతున్న సవటివాగు
- పూడికతో నిండిన పంట కాలువలు
- పొలాల్లో రోజుల తరబడి నీరు నిల్వ
- దెబ్బతింటున్న పంటలు
- ఇటీవల వర్షాలకు దెబ్బతిన్న 150 ఎకరాల్లోని నారుమళ్లు
- ఏటా నష్టపోతున్న పాతదేవరాయపల్లి రైతులు



ఈ ఫొటోలో కనిపిస్తున్న కౌలురైతు పేరు సత్యాల పెంచలయ్య. పాతదేవరాయపల్లి గ్రామం. ఈ ఏడాది రెండు ఎకరాల మాగాణి కౌలుకు తీసుకున్నారు. రబీ పంట సాగుకు రెండు బస్తాల వడ్లను తెచ్చి నారు పోశారు. తొలిరోజు నుంచే వర్షాలు మొదలవడం..చవిటి వాగు వరదనీరు పొలాలను ముంచెత్తడంతో నారు పాచిపోయి నష్టపోయారు.



ఈ ఫొటోలో కనిపిస్తున్న రైతు పేరు చల్లా కృష్ణారెడ్డి. పాతదేవరాయపల్లి గ్రామం. ఆరెకరాల్లో రబీ సాగుకు నారుపోశారు. వర్షాలకు ఎగువ నుంచి వచ్చిన వరదనీరు నారుమడిని ముంచెత్తింది. కాలువలు పూడిపోయి వరద నీరు బయటకు వెళ్లే పరిస్థితి లేక వారం రోజుల పాటు అలాగే ఉండడంతో నారు పాచిపోయింది. ఈ పరిస్థితిని పాతదేవరాయపల్లితో పాటు దిగువన ఉన్న గ్రామాల రైతులందరూ ఎదుర్కొంటున్నారు.



నీట మునిగి ఉన్న నారుమడి

సోమశిల: అనంతసాగరం మండలం పాతదేవరాయపల్లి, ముత్తుకూరు, వడ్డిపాళెం, కొత్తపల్లి, తదితర గ్రామాల రైతులు ఏటా ముంపు కష్టాలను ఎదుర్కొంటున్నారు. వర్షం పడితే సవటి వాగు పొలాలను ముంచెత్తడంతో పంటలు దెబ్బతిని నష్టపోతున్నారు.

పొలాలను ముంచుతున్న సవటివాగు

అనంతసాగరం చెరువు కింద 3,500 ఎకరాల ఆయకట్టు ఉంది. అందులో పాతదేవరాయపల్లి, ముత్తుకూరు, వడ్డిపాళెం, కొత్తపల్లి, తదితర గ్రామాల్లోనే దాదాపు రెండు వేల ఎకరాలు ఉంది. గతంలో పాతదేవరాయపల్లి మాగాణి భూముల్లో పంటలను సాగు చేసేందుకు రైతులు ఎంతో ఆసక్తి చూసేవారు. పంటలు పుష్కలంగా పండి మంచి లాభాలు వస్తాయని సాగుకు ముందుకొచ్చే వారు. ఇటీవల కాలంలో ఏటా సవటివాగు ముంపుతో పంటలు దెబ్బతిని నష్టాలు వస్తుండడంతో సాగుకు రైతులు వెనకడుగు వేస్తున్నారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ఆరేళ్ల క్రితం అనంతసాగరం చెరువు ఆయకట్టు పొలాల్లోని వరద నీటిని కొమ్మలేరు వాగుకు తరలించేందుకు సవటివాగు డ్రెయిన్‌ను పాతదేవరాయపల్లి సమీపంలోని బండరేవు వరకు తవ్వారు. అక్కడి వరకు పోరంబోకు భూములు ఉండడంతో పనులు చేపట్టారు. ఆ తరువాత పట్టా భూముల్లో తవ్వకాలను రైతులు అడ్డుకున్నారు. అప్పట్నుంచి పాతదేవరాయపల్లితో పాటు దిగువన ఉన్న ఈ సవటవాగు వల్ల పాతదేవరాయపల్లి, ముత్తుకూరు, వడ్డిపాళెం, కొత్తపల్లి తదితర గ్రామాల రైతులు ముంపు సమస్యను ఎదుర్కొంటున్నారు. వర్షం పడితే ఎగువ పొలాల్లోని నీరు సవట వాగు ద్వారా దిగువన ఉన్న పొలాలను ముంచెత్తుతోంది. దీనికి తోడు పంట కాలువలు పూడికతో నిండి పొలాల్లోని నీరు దిగువకు వెళ్లే పరిస్థితి లేక పంటలు దెబ్బతిని రైతులు నష్టపోతున్నారు.

పరిష్కారం ఇదీ...

సవటవాగు పొలాలను ముంచెత్తడం వల్లే పంటలు దెబ్బతిని నష్టపోతున్నామని రైతులు వాపోతున్నారు. సవటవాగును కొమ్మలేరులో కలపడంతో పాటు పంట కాలువల్లో పూడికతీత చేపడితే ముంపు సమస్యకు పరిష్కారం లభిస్తుందని చెబుతున్నారు. ఇరిగేషన్ అధికారులు స్పందించి పట్టా భూముల కలిగిన రైతులకు పరిహారం అందించి కొమ్మలేరు వాగులో సవటవాగును కలపాలని కోరుతున్నారు.



తూటాకుతో నిండిన ముత్తుకూరు కాలువ

ప్రతిపాదనలు పంపాం

మండలంలోని పంట కాలువల పూడికతీసే పనులకు నివేదిక తయారుచేసి ఉన్నతాధికారులకు పంపి ఉన్నాం. నిధులు మంజూరు కాగానే పనుల ప్రారంభిస్తాం. సవటవాగు పూర్తి చేయాలని ఉన్నతాధికారులు ఆదేశిస్తే దానిని పూర్తి చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటాం.

– ఖాదర్, ఇరిగేషన్ జేఈఈ, అనంతసాగరం



పొలాలను ముంచుతున్న సవటవాగు

దెబ్బతిన్న 150 ఎకరాల్లోని నారుమడులు

ఇటీవల కురిసిన వర్షాలకు పాతదేవరాయపల్లితో పాటు దిగువవ ఉన్న గ్రామాల్లో 150 ఎకరాల్లోని నారుమడులు దెబ్బతిన్నాయి. ఆయా గ్రామాల్లోని రైతులు రబీ సాగుకు నారుమడులు పోసిన వెంటనే వర్షాలు మొదలయ్యాయి. దీనికి తోడు సవటి వాగు నీరు పొలాలను ముంచెత్తింది. పంట కాలువలు పూడికతో నిండి నీరు బయటకు వెళ్లే పరిస్థితి లేకుండాపోయింది. వారం రోజుల పాటు నీరు అలాగే ఉండడంతో నారుమడులు పాచిపోయి రైతులు నష్టపోయారు.



కాలువ పూడిపోయి పొలాల్లో చేరుతున్న నీరు

దివ్యాంగులకు ఉపకరణాలు

ఉదయగిరి: వచ్చే నెల 4న లూయీ బ్రెయిలీ జయంతి సందర్భంగా ఉదయగిరి మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో దివ్యాంగులకు ఉపకరణాలను పంపిణీ చేయనున్నట్లు దివ్యాంగుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆదోని రమణయ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయగిరి, సీతారామపురం, వరికుంటపాడు మండలాల దివ్యాంగులకు బస్‌పాస్‌లు, ట్రైసైకిళ్లు, వీల్‌చైర్లు, చేతికర్రలు, వినికిడి మెషీన్లు పంపిణీ చేయనున్నట్లు చెప్పారు. అర్హులైన వారు ఈ నెల 24 నుంచి ఉదయగిరి మండల పరిషత్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. వివరాలకు 73372 68192, 94926 80270 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

26 నుంచి సీజనల్ వ్యాధులపై కళాజాత

ఆత్మకూరురూరల్: మండలంలోని అన్ని గ్రామాల్లో సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించేందుకు ఈ నెల 26 నుంచి కళాజాత ప్రదర్శనలు నిర్వహించనున్నట్లు ఆత్మకూరు ఎంపీడీఓ ఐజాక్ ప్రవీణ్ శనివారం తెలిపారు. 26న వాశిలి, అప్పారావుపాళెం, బట్టేపాడు, 27న నల్లపరెడ్డిపల్లి, కనుపూరుపల్లి, మురగళ్ల, 28న రావులకొల్లు, చెర్లోయడవల్లి, నాగులపాడు, 30న నారంపేట, బోయలచిరివెళ్ల, కరటంపాడు, 31న నువ్వూరుపాడు, దేపూరు, బండారుపల్లి, జనవరి 2న మహిమలూరు, రామస్వామిపల్లి, వెన్నవాడ, 3న పడకండ్ల, పమిడిపాడు, ఆరవేడు గ్రామాల్లో కళాజాతా ప్రదర్శనలు ఉంటాయని తెలిపారు.

40 మద్యం బాటిళ్ల స్వాధీనం

కొండాపురం: మండలంలోని పలు గ్రామాల్లో ఎక్సైజ్ అధికారులు శనివారం దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో ముగ్గురి వద్ద 40 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని కేసులు నమోదు చేసినట్లు ఎక్సైజ్ సీఐ మహమ్మద్ అబ్దుల్‌జలీల్ తెలిపారు. ఆయన వెంట కానిస్టేబుల్ నజీర్‌బాషా, సిబ్బంది ఉన్నారు.

పేదల పక్షపాతి వైఎస్ జగన్

- కావలి మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి
- ఘనంగా మాజీ సీఎం వైఎస్ జగన్ పుట్టినరోజు వేడుకలు



కావలిలో భారీ కేక్ కట్ చేసి మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డికి తినిపిస్తున్న నాయకులు

కావలి: మాజీ సీఎం, వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల పక్షపాతి అని, ఆయన తన ఐదేళ్ల పాలనలో పేదల సంక్షేమమే ధ్యేయంగా పథకాలను అమలు చేశారని కావలి మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి కొనియాడారు. వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పుట్టిన రోజు వేడుకలను కావలిలో మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. భారీ కేక్ కట్ చేసి పంచారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. వైఎస్సార్ టీచర్స్ అసోసియేషన్ కావలి శాఖ ఆధ్వర్యంలోనూ వేడుకలు నిర్వహించారు.

బోగోలులో అన్నదానం

బిట్రగుంట: బోగోలులోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో జరిగిన వైఎస్ జగన్ పుట్టిన రోజు వేడుకలకు కావలి మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి హాజరయ్యారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో కలిసి కేక్ కట్ చేశారు. అనంతరం ర్యాలీగా బోగోలు ప్రధాన కూడలికి చేరుకుని అన్నదానం చేశారు. ఎంపీపీ మేకల సుజాత, జెడ్పీటీసీ మద్దిబోయిన కీర్తన, మండల యువత అధ్యక్షుడు మేకల శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

రోగులకు బ్రెడ్లు, పండ్లు పంపిణీ

ఆత్మకూరు: పట్టణంలోని మాజీ ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ నాయకులు డాక్టర్ సీహెచ్ ఆదిశేషయ్య, నాగలపాటి ప్రతాప్‌రెడ్డి, కొండా వెంకటేశ్వర్లు నేతృత్వంలో భారీ కేక్‌ను కట్ చేసి స్వీట్లు పంచిపెట్టారు. అనంతరం జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలోని రోగులకు బ్రెడ్లు, పండ్లను పంపిణీ చేశారు. సంగం మండల కన్వీనర్ పులగం శంకర్‌రెడ్డి, నోటి వినయ్‌కుమార్‌రెడ్డి, ఎం మల్లికార్జున, బొమ్మిరెడ్డి రవి కుమార్‌రెడ్డి, సూరి మదన్‌మోహన్‌రెడ్డి, వెంకగళరెడ్డి, బాలఅంకయ్య, సర్పంచ్ వెంకటేశ్వర్లు, హరిబాబు, శ్రీనివాసులు నాయుడు, తోడేటి మణి, జమ్రు, ఎస్ ప్రతాప్, తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరురూరల్: మహిమలూరులో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ చిట్టమూరు జితేంద్రనాగ్‌రెడ్డి ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి పంచారు.

సోమశిల : అనంతసాగరం బస్టాండ్ సెంటర్‌లో వైఎస్సార్‌సీపీ నాయకుడు బట్రెడ్డి జనార్దన్‌రెడ్డి, బొమ్మవరం అగ్రహారంలో మాజీ సర్పంచ్ అక్కలరెడ్డి అంకిరెడ్డి ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి పంచారు. ఎంపీపీ పెయ్యల సంపూర్ణమ్మ, సర్పంచ్ కమతం శోభ, వైస్ ఎంపీపీ అల్లంపాటి సుధాకర్‌రెడ్డి, గౌరవరం ఎంపీటీసీ కాలువ నరసింహులు, నాయకులు బుట్టి రఘురామిరెడ్డి, మెట్టుకూరు సుబ్బారెడ్డి, కేతా రాఘవరెడ్డి, రెడ్డిమల్ల ప్రభాకరరెడ్డి, కేతా రవీంద్రరెడ్డి పాల్గొన్నారు.

చేజర్ల: ఆదూరుపల్లిలో జెడ్పీటీసీ పీర్ల పార్థసారధి ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి పంచారు. నాయకులు పీర్ల పెంచయ్య, పీర్ల కోటయ్య, ఎస్ శీనయ్య, ఇరగబోయిన బుజ్జయ్య, చీర్ల వెంకటయ్య పాల్గొన్నారు.

మర్రిపాడు : మర్రిపాడులో వైఎస్సార్‌సీపీ నాయకులు వైఎస్ జగన్ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించి కేక్ కట్ చేశారు. బ్రాహ్మణపల్లిలోని మేకపాటి నివాసంలో చెన్ను వెంకటేశ్వరరెడ్డి, జయరామిరెడ్డి, పెనగలూరి వెంకటేష్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. పార్టీ



ఆత్మకూరులో రోగులకు బ్రెడ్లు, పండ్లు పంపిణీ



బిట్రగుంట: బోగోలులో అన్నదానం

మండల కన్వీనర్ బొర్రా సుబ్బిరెడ్డి, మాజీ మండల కన్వీనర్ గంగవరపు శ్రీనివాసులునాయుడు, ఎంపీటీసీ నాయుడు హజరత్‌రెడ్డి, రవీంద్రబాబు, ప్రతాప్‌రెడ్డి, కృష్ణంరాజు, నారాయణస్వామి పాల్గొన్నారు.

ఉదయగిరి: స్థానిక ట్యాంక్ బండ్‌పై ఉన్న వైఎస్సార్ విగ్రహం వద్ద వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ జీ ఓబులరెడ్డి ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి పంచారు. నాయకులు శ్రీనివాసరెడ్డి, తిరుపతి, మర్తుజా, యస్దాని, రమణారెడ్డి, భాస్కర్‌రెడ్డి, సుందరం, వెంగళరెడ్డి, సలీమ్, గౌస్‌మొహిద్దీన్ పాల్గొన్నారు.

• వింజమూరులోని పంచాయతీ సెంటర్, బంగ్లాసెంటర్‌లో వైఎస్సార్‌సీపీ శ్రేణుల ఆధ్వర్యంలో వైఎస్సార్ విగ్రహాలకు నివాళులర్పించి కేక్‌లు కట్ చేసి పంచారు. జెడ్పీటీసీ జీ బాలకృష్ణారెడ్డి, ఎంపీటీసీ పీ కొండారెడ్డి, సొసైటీ మాజీ అధ్యక్షులు ఎం విజయ్‌రెడ్డి, చిన్నికృష్ణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు,

దుత్తలూరు: దుత్తలూరులో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ దొంతిరెడ్డి వాసుదేవరెడ్డి ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి స్వీట్లు పంచారు. బ్రహ్మేశ్వరం, బోడవారిపల్లి సర్పంచ్‌లు మీసాల సుబ్బరాయుడు, రామిరెడ్డి కొండారెడ్డి, ఎంపీటీసీ కాలిచప్పిడి వెంకటేశ్వర్లు, నాయకులు తుమ్మల వెంగయ్యచౌదరి, కండ్లగుంట వెంకటరెడ్డి, తిరుపాల్‌నాయుడు, చుండి నాగార్జున, పుల్లారెడ్డి, నరసింహరావు, తదితరులు పాల్గొన్నారు.

కొండాపురం: స్థానిక వైఎస్సార్ విగ్రహం వద్ద వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ చిమ్మిలి రవీంద్ర ఆధ్వర్యంలో భారీ కేక్ కట్ చేసి స్వీట్లు పంచి పెట్టారు. తొలుత వైఎస్సార్ విగ్రహానికి పాలాభిషేకం నిర్వహించారు. నాయకులు వేమిరెడ్డి మల్లికార్జునరెడ్డి, ఎడ్లపల్లి వెంకట రమణయ్య, వెంకటసుబ్బయ్య, మాల్యాద్రి, చంద్రయ్య, చిన కొండయ్య, కమలాకర్ పాల్గొన్నారు.

జలదంకి: స్థానిక బస్టాండ్ సెంటర్‌లో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పాలవల్లి మాలకొండారెడ్డి ఆధ్వర్యంలో భారీ కేక్ కట్ చేసి స్వీట్లు పంచి పెట్టారు. నాయకులు తిప్పారెడ్డి ఇందిరమ్మ, ఇస్కా మదన్‌మోహన్‌రెడ్డి, కోర్సిపాటి రామిరెడ్డి, దండా అనిల్‌కుమార్‌రెడ్డి, వాకా శ్రీనివాసులరెడ్డి, గుమ్మలంపాటి సుబ్బారావు, కుట్టుబోయిన శేఖర్, రామయ్య, ఒంగోలు రాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు. గోపన్నపాళెంలోని వైఎస్సార్ విగ్రహానికి స్థానిక నాయకులు నివాళులర్పించారు. అనంతరం జగన్ పుట్టిన రోజు కేక్‌ను కట్ చేశారు. సంగన, యర్రంరెడ్డి, మార్తల, రావూరి కుటుంబాలు పాల్గొన్నాయి.

కలిగిరి: మండల కేంద్రమైన కలిగిరిలో జెడ్పీటీసీ పాలూరు మాల్యాద్రిరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కాటం రవీంద్రారెడ్డి ఆధ్వర్యంలో వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. పార్టీ మండల యూత్ కన్వీనర్ కోడూరు కృష్ణారెడ్డి, స్థానిక నాయకులు రాధాకృష్ణారెడ్డి, హజరత్‌రెడ్డి, మోహన్, మనోహర్, తదితరులు పాల్గొన్నారు.

వరికుంటపాడు: స్థానిక పంచాయతీ బస్టాండ్ సెంటర్‌లో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మందలపు తిరుపతినాయుడు, ఏఎంసీ మాజీ చైర్మన్ షేక్ ఆలీఅహ్మద్, మాగంటి శ్రీనావాసులు కేక్ కట్ చేసి పంచారు. పార్టీ నాయకులు బీ వెంకటేశ్వరరెడ్డి, ఆర్ మధుసూదన్‌రావు, ఎం చెన్నకేశవులు, తదితరులు పాల్గొన్నారు.

సీతారామపురం: స్థానిక బస్టాండ్ సెంటర్‌లోని వైఎస్సార్ విగ్రహం వద్ద వైఎస్సార్‌సీపీ నాయకులు కేక్‌ను కట్‌చేసి స్వీట్లు పంచిపెట్టారు. పార్టీ మండల కన్వీనర్ సీహెచ్‌వీ సుబ్బారెడ్డి, సీతారామపురం బిట్-1 ఎంపీటీసీ పీసీ అల్లూరురాజు, అయ్యవారిపల్లి సర్పంచ్ దుర్గాప్రసాద్, వైఎస్సార్‌సీపీ నాయకులు గాజులపల్లి రామ్మోహన్‌రెడ్డి, పాణెం రమణయ్య, దుగ్గిరెడ్డి వెంకటసుబ్బారెడ్డి, గుర్రం సుబ్బయ్య, బాలినేని మాబయ్య, తదితరులు పాల్గొన్నారు.



ఉదయగిరిలో..



మర్రిపాడులో జగన్ చిత్రపటానికి పాలాభిషేకం

ఎమ్మెల్యే కృష్ణారెడ్డివి ఉత్తరకుమార ప్రగల్భాలే

- మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి

కావలి: కావలి ఎమ్మెల్యే డీవీ కృష్ణారెడ్డి ఉత్తరకుమార ప్రగల్భాలతో ప్రజలను మాయ చేస్తూ అరాచక పాలన సాగిస్తున్నారని మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి విమర్శించారు. శనివారం కావలిలోని తన నివాసంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. కావలి నియోజకవర్గంలో చిరు ఉద్యోగులు, చిరువ్యాపారుల కడుపు కొట్టడం, వ్యక్తుల ఆస్తులను నష్టపరచడం, నాయకులు, కార్యకర్తలపై దాడులు చేయడం, నిందలు వేయడం, మీడియా సోదరులను, సోషల్ మీడియాలో పోస్టులు పెట్టే వారిపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడడం వంటి చర్యలతో అరాచక పాలన సాగిస్తున్నారని మండిపడ్డారు. డీవీ కృష్ణారెడ్డి ఎమ్మెల్యే కాగానే ఉత్తర కుమారుడి ప్రగల్భాలుగా పలికారన్నారు. తుమ్మలపెంట రోడ్డును డిసెంబర్ లోగా పూర్తి చేస్తానని, కొత్త సంవత్సరం వేడుకలను తుమ్మలపెంట రోడ్డుపై చేస్తానని చెప్పడం ప్రజలను మాయ చేయడం కాదా అని ప్రశ్నించారు. తుమ్మలపెంట రోడ్డులో సుమారు రూ.8 కోట్లతో నిర్మించాల్సిన రెండు బ్రిడ్జిలకు ఇప్పటి వరకు కనీసం శంకుస్థాపన కూడా చేయలేదన్నారు. పట్టణంలోని జెడ్పీ హైస్కూల్ నుంచి జాతీయ రహదారి అండర్ పాస్ వరకు ఇరువైపులా డ్రెయిన్లు, సిమెంట్ రోడ్డు నిర్మించి సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయాల్సి ఉందన్నారు. తుమ్మలపెంటలోని నాలుగు రోడ్ల కూడలి జంక్షన్‌లోని అక్రమ నిర్మాణాలను తొలగించి అన్నగారిపాళెం, జువ్వలదిన్నె, కొత్తసత్రం, రాముడుపాళెం, తుమ్మలపెంట, రామయాపట్నం తదితర 20 గ్రామాల ప్రజలు రాకపోకలకు ఎదుర్కొంటున్న సమస్యను పరిష్కరించాల్సి ఉందన్నారు. ఈ పనులు చేపట్టకుండానే ఎమ్మెల్యే మాయ మాటలతో మభ్యపెడుతున్నారని మండిపడ్డారు. ప్రజలు ఇచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని మంచి పనులు చేపట్టి పేరు తెచ్చుకోవాలే తప్ప, పనికిమాలిన పనులు చేపడితే భవిష్యత్తులో తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఎమ్మెల్యే అక్రమాలపై తమ పోరాటం ఆగదని, ఎమ్మెల్యేకు చెందిన అన్నవరం క్వారీ మీద కావలిలోనే కాదు, ఉదయగిరిలో కూడా వైఎస్సార్‌సీపీ పోరాడుతుందన్నారు.ఎమ్మెల్యే బండారాన్ని బయటకు తీసి ప్రజల ముందు ఉంచుతామన్నారు. ప్రజలు అభివృద్ధి, సంక్షేమం కోసం కూటమి ప్రభుత్వంపై పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల వేళ ప్రజలకు అనేక వాగ్దానాల ఇచ్చి వాటిని అమలు చేయకుండా విస్మరించి ప్రజలను మోసం చేసిందని విమర్శించారు. కూటమి నాయకులు రోజుకో రంగు మారుస్తూ ప్రజలను మభ్యపెడుతున్నారని విమర్శించారు. చంద్రబాబు నైజం ఆరు నెలల్లోనే ప్రజలకు అర్థమైందన్నారు. ఎన్నికలు ఎప్పుడు జరిగినా చంద్రబాబుకు సున్నం పూయడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. విద్యుత్ చార్జీల పెంపుపై ఈ నెల 27న కావలిలో వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో చేపడుతున్న ఆందోళనలో ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

త్వరలో ‘కలయిక’ విజ్ఞాన కేంద్రం ఏర్పాటు



కావలి: పట్టణంలోని రామమూర్తిపేటలోని సాయిబాబు మందిరం వద్ద ఉన్న కలయిక కల్యాణ మండపంలోని గ్రౌండ్‌ఫ్లోర్‌లోని ఓ గదిలో విజ్ఞాన కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నట్లు ఆ కల్యాణ మండం నిర్వాహకులు రాంప్రసాద్, లావణ్య దంపతులు తెలిపారు. కావలిలోని సామాజిక, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, జేవీవీ ప్రతినిధులతో శనివారం వారు సమావేశమయ్యారు. కలయిక విజ్ఞాన కేంద్రం ఏర్పాటు, నిర్వహణపై చర్చించారు. ఈ సందర్భంగా కావలి ఉమెన్ ఫోర్స్ కన్వీనర్ సీ శారద మాట్లాడుతూ కావలిలోని ప్రజా, మహిళా సంఘాలు స్వచ్ఛంద సంస్థలు ఎంతోకాలంగా సమావేశాలను ఏర్పాటు చేసుకునేందుకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గ్రంథాలయం, రీడింగ్ రూము, సామాజిక సంస్థల సమావేశాల కోసం కలయిక విజ్ఞాన కేంద్రం ఏర్పాటుకు లావణ్య, రాంప్రసాద్ దంపతులు ముందుకురావడం అభినందనీయమన్నారు. కలయిక విజ్ఞాన కేంద్రం పోటీపరీక్షలకు సిద్ధమయ్యే యువతకు ఎంతో ఉపయోగకరమన్నారు.

సీఆర్సీ సేవలను సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న సీఆర్సీ ప్రతినిధి రఘు

ఆత్మకూరురూరల్: సీఆర్‌సీ సంస్థ సేవలను దివ్యాంగులు సద్వినియోగం చేసుకోవాలని కేంద్ర ప్రభుత్వ నైపుణ్యాభివృద్ధి, పునరావాసం మరియు సాధికారత కేంద్ర ప్రతినిధి రఘు అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో దివ్యాంగులకు ఉపకరణాల పంపిణీ కోసం శనివారం నిర్వహించిన ప్రత్యేక శిబిరానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. వెంకటాచలం కేంద్రంగా సీఆర్సీ పనిచేస్తుందన్నారు. సీఆర్సీ ద్వారా దివ్యాంగులు, వృద్ధులకు అవసరమైన ఉపకరణాల పంపిణీతో పాటు విద్యా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. సీఆర్సీ మరో ప్రతినిధి దామోదర్ మాట్లాడుతూ ఐదేళ్లలోపు బాలబాలికలకు ఫిజియోథెరపి, స్పీచ్‌థెరపి, సైకాలజీ, తదితర సేవలు అందిస్తున్నామన్నారు. ఎంపీడీఓ ఐజాక్ ప్రవీణ్ మాట్లాడుతూ 21 రకాల దివ్యాంగుల పునరావాసం కోసం సీఆర్సీ సంస్థ అందిస్తున్న సేవలను వివరించారు. అనంతరం దివ్యాంగులు, వృద్ధులకు పరీక్షలు నిర్వహించి ఉపకరణాలకు ఎంపిక చేశారు. ఎంపీపీ కేతా వేణుగోపాల్‌రెడ్డి, వైస్‌ఎంపీపీ ఉద్దాల పెంచల రావు, మండల పరిషత్ ఏఓ శ్రీనివాస రావు, ఈఓపీఆర్డీ డేవిడ్, పులిమి శైలజారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అమిత్‌షా వ్యాఖ్యలపై నిరసన

ఆత్మకూరురూరల్: పార్లమెంట్‌లో భారత రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్‌పై కేంద్ర హోంమంత్రి అమిత్‌షా చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద సీపీఎం నాయకులు శనివారం నిరసన కార్యక్రమం చేపట్టారు. పట్టణ కార్యదర్శి డేవిడ్, సీపీఎం నాయకులు సందానీ, నాగేంద్ర, తదితరులు ఈ మాట్లాడుతూ అమిత్‌షాను మంత్రి పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగురాలికి చేయూత

ఆత్మకూరు: పట్టణంలోని 15వ వార్డు గిరిజనకాలనీకి చెందిన దివ్యాంగురాలు రమణమ్మకు వైఎస్సార్‌సీపీ డాక్టర్స్ విభాగం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ జే ప్రణీత్ రెండు నెలలకు సరిపడా నిత్యావసర సరుకులను వితరణ చేశారు. శనివారం తన సిబ్బంది ద్వారా రమణమ్మకు సరుకులను అందజేశారు. తోడేటి అశోక్, కొమరగిరి రమణమ్మ ఉన్నారు.

ఎరువుల దుకాణాల్లో తనిఖీలు

చేజర్ల/ అనుమసముద్రంపేట: చేజర్లం మండలంలోని ఆదూరుపల్లిలోని ఎరువుల దుకాణాలను జిల్లా వ్యవసాయ అధికారి సత్యవాణి శనివారం తనిఖీ చేశారు. ఎరువులను అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆమె వెంట ఇన్‌చార్జి ఏడీఏ శ్రీదేవి, ఏఓ శశిధర్ ఉన్నారు. అలాగే ఏఎస్‌పేట మండలం హసనాపురంలో ఎరువుల దుకాణాలను ఏఓ టీ రజనీ తనిఖీ చేశారు. స్టాక్ రిజిష్టర్లను తనిఖీ చేసి నిల్వలను పరిశీలించారు.